సాక్షి పశ్చిమగోదావరి

ఆదివారం । 23 । జూన్ । 2024



భక్తజన సాగరం

ద్వారకాతిరుమల: చినవెంకన్న క్షేత్రం శనివారం భక్తులతో కిటకిటలాడింది. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. **క్షేత్ర పరిసరాలు సందడిగా మారాయి.**



రొయ్య మేత.. మోత

రొయ్యల మేత ధర పెరుగుదల రైతులను కలవరపాటుకు గురిచేస్తోంది. రొయ్యల మేతలు, ఫీడ్ కూలీల ఖర్చు విపరీతంగా పెరిగింది. 8లో ▸



టాలీవుడ్‌లో మెరుపులు

తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన అమ్మాయి పజ్మశ్రీ టాలీవుడ్‌లో సందడి చేస్తోంది. 'ప్రభుత్వ జూనియర్ కళాశాల' సినిమాలో నటించింది. 8లో ▸

న్యూస్‌రీల్

'పశ్చిమ' కలెక్టర్‌గా నాగరాణి
కలెక్టర్ సుమిత్‌కుమార్ చిత్తూరు బదిలీ



సాక్షి, భీమవరం: పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్‌గా ఏపీ టెక్నికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ సి.నాగరాణి నియమితులయ్యారు. ఇప్పటి వరకు కలెక్టర్‌గా విధులు నిర్వర్తించిన **సుమిత్ కుమార్** చిత్తూరు కలెక్టర్‌గా **బదిలీ అయ్యారు.** ఈ మేరకు శనివారం రాత్రి **ప్రభుత్వం ఉత్త**ర్వులు విడుదల చేసింది. 2010 **బ్యాచ్‌కు** చెందిన నాగరాణి గతంలో **హేండలూమ్స్,** టెక్స్‌టైల్స్ డైరెక్టర్‌గా సేవలందించారు. తర్వాత రాష్ట్ర టెక్నికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌గా సమర్థవంతమైన పాత్ర పోషించారు. తాజా నియామకంతో రెండు రోజుల్లో పశ్చిమ కలెక్టర్‌గా ఆమె బాధ్యతలు చేపట్టనున్నట్టు కలెక్టరేట్ వర్గాలు తెలిపాయి.

వరాల వెంకన్నకు పుష్పయాగోత్సవం



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

అత్తిలి: ఈదూరులోని వరాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు శ్రీ పుష్పయాగోత్సవంతో శనివారం ఘనంగా ముగిశాయి. గ్రామానికి చెందిన పెరికెల పాండురంగ, అనంతలక్ష్మి దంపతుల సౌజన్యంతో మల్లెపూలతో శ్రీవారిని విశేషంగా అలంకరించారు. అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలు జరిగాయి. మంతెన సీతారామరాజు పర్యవేక్షణలో అత్తిలి ఎస్సై వి.రాంబాబు ఆధ్వర్యంలో అల్లరి పశ్లెం కూపన్ల డ్రా తీశారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఆలయ ఈఓ ఆకుల వెంకట నారాయణరావు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

కక్ష సాధింపులతోనే కార్యాలయం కూల్చివేత



పాలకొల్లులో విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పాలకొల్లు అర్బన్: తాడేపల్లిలో నిర్మాణంలో ఉన్న వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయాన్ని కూల్చడం కక్ష సాధింపు చర్యల్లో భాగమేనని ఆ పార్టీ నాయకులు ఖండించారు. పట్టణంలో శనివారం శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ జోగి వెంకటేశ్వరరావు తదితరులు విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది రోజులు కూడా గడవకముందే ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడటం దుర్మార్గమన్నారు. వైఎస్సార్ సీపీ కార్యాలయానికి సంబంధించి అన్ని అనుమతులు ఉన్నా, అలాగే కోర్టు స్టే విధించినా కూటమి ప్రభుత్వం అధికారులపై తీవ్ర ఒత్తిడి తీసుకువచ్చి కార్యాలయాన్ని కూల్చడం కోర్టు ధిక్కారమేనన్నారు. ప్రభుత్వం దీనికి తగిన మూల్యం చెల్లిస్తుందన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడినప్పటి నుంచి టీడీపీ, జనసేన కార్యకర్తలు రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడులకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. శిలాఫలకాలు ధ్వంసం చేయడం క్షమించరాని నేరమన్నారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు జోగాడ ఉమామహేశ్వరరావు, గంగిరెడ్ల ప్రసాద్ పాల్గొన్నారు.

కూల్చివేత అప్రజాస్వామ్యం

ఉండి: తాడేపల్లిలో వైఎస్సార్‌సీపీ పార్టీ కేంద్ర కార్యాలయం కూల్చివేత అప్రజాస్వామ్యమని వైఎస్సార్‌సీపీ జిల్లా మాజీ అధికార ప్రతినిధి బడుగు బాలాజీ శనివారం ప్రకటనలో దుయ్యబట్టారు. వైఎస్సార్‌సీపీ తరఫున దారుణ కాండను ఖండిస్తున్నామన్నారు.

26న క్యాంపస్ డ్రైవ్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉపాధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 26న ఏలూరులోని ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నట్టు ఏలూరు ప్రభుత్వ ఐటీఐ ప్రధానాధికారి పి.రజిత ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ 08812 230269 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

అమ్మో.. ఆపరేషనా!

- కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలకు పురుషులు దూరం
- అవగాహన ఉన్నా అపోహలతో వెనుకంజ
- గతేడాది ఉమ్మడి జిల్లాలో 50 మందికే వేసక్టమీ ఆపరేషన్లు
- ట్యూబెక్టమీ చేయించుకుంది 9,279 మంది మహిళలు



పాలకోడేరు పీహెచ్‌సీలో వేసక్టమీ ఆపరేషన్ చేస్తున్న దృశ్యం (ఫైల్)

ఆకివీడు: జనాభాను నియంత్రించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుటుంబం నియంత్రణను ప్రోత్సహిస్తున్నాయి. మహిళలకు ట్యూబెక్టమీ, పురుషులకు వేసక్టమీ ఆపరేషన్లు చేస్తున్నారు. అయితే కుటుంబ నియంత్రణ (కు.ని) శస్త్రచికిత్స అంటే మహిళలే చేయించుకోవాలి అనేది సమాజంలో బలంగా పాతుకుపోయింది. ప్రసవం అనంతరం ట్యూబెక్టమీ చేయించుకోవడం దశాబ్దాలుగా వస్తోంది. ఇంటి పట్టునే ఉండే మహిళలు ఈ ఆపరేషన్ చేయించుకుంటే మంచిదని, వృత్తి, వ్యాపార, ఉద్యోగాల రీత్యా శ్రమించే పురుషులు చేయించుకుంటే బలహీనపడతారనేది మరో అపోహ కూడా ఉంది. ఆయా కారణాలతో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో వేసక్టమీ ఆపరేషన్లు చేయించుకునే పురుషుల సంఖ్య ఏటేటా తగ్గుతోంది.

ఆమెకే ఆ'పరేషన్'

ట్యూబెక్టమీ ఆపరేషన్ల సంఖ్య ఏడాదికి వేలల్లో ఉంటుండగా.. వేసక్టమీ ఆపరేషన్లు మాత్రం పదుల సంఖ్యలో కూడా ఉండటం లేదు. వేసక్టమీ ఆపరేషన్ల ఆవశ్యకతపై క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది అవగాహన కల్పిస్తున్నా వెనుకడుగు వేస్తున్నారు. తమ వ్యాపారాలు, ఉపాధి అవకాశాలకు ఆటంకం కలుగుతుందని, ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయనే అపోహలతో పురుషులు వెనుకంజ వేస్తున్నారు. ఆరోగ్యపరంగానూ మహిళలు కంటే పురుషులు కుటుంబనియంత్రణ ఆపరేషన్లు చేయించుకుంటే మంచిదని వైద్యులు చెబుతున్నా పెద్దగా స్పందన ఉండటం లేదు.

సులభంగా శస్త్రచికిత్స

కుటుంబ నియంత్రణలో మహిళలకు చేసే ట్యూబెక్టమీ కన్నా పురుషులకు చేసే వేసక్టమీ ఆపరేషనే సులభమని వైద్యులు చెబుతున్నారు. ఆపరేషన్ చేయించుకున్న 36 గంటల్లో మహిళలు ఇంటికి వెళ్లిపోవచ్చని అదే పురుషులైతే గంటల్లోనే లేచి ఇంటికి వెళ్లవచ్చని అంటున్నారు. వేసక్టమీ ఆపరేషన్లపై వైద్య సిబ్బంది అవగాహనా సదస్సుల్లో వివరిస్తున్నా పురుషులు ముందుకు రావడం లేదు. దీంతో వేసక్టమీ ఆపరేషన్ల సంఖ్య ఏడాదికి పదుల్లోనే ఉంటోంది. 2022–23 సంవత్సరం నుంచి ఇప్పటివరకు పశ్చిమగోదావరి జిల్లాలో 103 మంది, ఏలూరు జిల్లాలో 52 మంది పురుషులు మాత్రమే వేసక్టమీ ఆపరేషన్ చేయించుకోగా.. ట్యూబెక్టమీ ఆపరేషన్లను పశ్చిమలో 12,352 మంది, ఏలూరు జిల్లాలో 22,576 మంది మహిళలు చేయించుకున్నారు.

గిరిజన ప్రాంతాల్లోనే అధికంగా..

నిరక్షరాస్యులైన గిరిజన ప్రాంతంలోని పురుషులు పలువురు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకుంటున్నారు. ఆపరేషన్ చేయించుకున్న తర్వాత రోజే వారు పనులకు వెళుతున్నట్టు వైద్య సిబ్బంది చెబుతున్నారు. గిరిజనుల నివసించే ప్రాంతాల్లోనే ఎక్కువ వేసక్టమీ ఆపరేషన్లు జరుగుతున్నాయని అంటున్నారు.

కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు

పశ్చిమగోదావరి జిల్లా			ఏలూరు జిల్లా		
సంవత్సరం	ట్యూబెక్టమీ	వేసక్టమీ	సంవత్సరం	ట్యూబెక్టమీ	వేసక్టమీ
2022–2023	6,507	59	2022–2023	5,306	24
2023–2024	5,001	31	2023–2024	4,278	19
2024–2025 (ఇప్పటివరకు)	844	13	2024–2025 (ఇప్పటివరకు)	640	09

ముందుకు రావడం లేదు



కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకునేందుకు పురుషులు ముందుకు రావడం లేదు. ఆపరేషన్ వల్ల ఎలాంటి ఇబ్బందీ ఉండదని వైద్య సిబ్బంది అవగాహన కల్పిస్తున్నా ఫలితం ఉండటం లేదు. పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాలో గత రెండున్నరేళ్లలో 103 మంది పురుషులకు మాత్రమే వేసక్టమీ చేశాం. మరింత మంది ముందుకు రావాలి.

– డాక్టర్ మహేశ్వరరావు, డీఎంహెచ్‌ఓ, భీమవరం

శక్తి సామర్థ్యాలు తగ్గవు



వేసక్టమీ చేయించుకుంటే పురుషుల్లో శక్తి, లైంగిక సామర్థ్యం తగ్గిపోతుందనే అపోహలు, అనుమానాలు చాలా మందిలో ఉన్నాయి. ఇది వాస్తవం కాదు. కుట్లు లేకుండా అతి చిన్న ఆపరేషన్‌తో ముగిస్తారు. రీ ఆపరేషన్ కూడా చేయించుకోవచ్చు. వేసక్టమీపై మరింత అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉంది.

– డాక్టర్ బాలు, సివిల్ అసిస్టెంట్ సర్జన్, ద్వారకాతిరుమల

అతిసార నియంత్రణకు చర్యలు

కలెక్టర్ సుమిత్‌కుమార్



కలెక్టరేట్ నుంచి సమీక్షిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలో అతిసార, డెంగీ వంటి కాలానుగుణ వ్యాధులను అరికట్టేందుకు అధికారులు పూర్తి సన్నద్ధతతో పనిచేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు . శనివారం స్థానిక కలెక్టరేట్ నుంచి గూగుల్ మీట్ ద్వారా ఆర్‌డబ్ల్యూఎస్, ఎంపీడీఓ, ఈవోపీఆర్డీ, పంచాయతీరాజ్ తదితర అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులను 15 రోజులకోసారి తప్పక శుభ్రం చేయించాలన్నారు. తాగునీటి నమూనాలను సేకరించి పరీక్షించాలన్నారు. ఎంపీడీఓ, ఈవోపీఆర్డీ, పంచాయతీ కార్యదర్శి రోజూ పరిశుభ్రతపై పర్యవేక్షణ చేయాలన్నారు. రోడ్ల వెంబడి చెత్త పోగుపడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పైపులైన్ లీకేజీలు అరికట్టడం ద్వారా డయేరియా ప్రబలకుండా చూడాలన్నారు. మొగల్తూరు ప్రాంతంలో మోటార్ల ద్వారా నీటిని తోడటం వలన శివారు ప్రాంతాల ప్రజలు సాగునీటి ఎద్దడికి గురవుతున్నారని, చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓను ఆదేశించారు. జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు డయేరియా నియంత్రణపై ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. డయేరియా బాధితులకు సత్వర వైద్యం అందించాలన్నారు. శానిటేషన్, పరిసరాల పరిశుభ్రత, శుద్ధమైన తాగునీరు, అనుబంధ శాఖల, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో ప్రచార కార్యక్రమాలు చేపట్టాలన్నారు. డీఆర్వో జె.ఉదయ భాస్కరరావు, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి బీవీ నాగేశ్వరరావు, జిల్లా అభివృద్ధి అధికారి కేసీహెచ్ అప్పారావు పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞానాన్ని పెంపొందించేలా వర్క్‌షాప్

రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ కృష్ణమోహన్



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ కృష్ణమోహన్

ఏలూరు(మెట్రో): చట్టాలపై న్యాయమూర్తులకు విజ్ఞానాన్ని మరింత పెంచడానికి న్యాయ అధికారుల వర్క్‌షాప్‌లు దోహదపడతాయని రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ బి.కృష్ణమోహన్ తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ అధ్యక్షతన జిల్లాలోని న్యాయమూర్తులకు చట్టాలకు సంబంధించిన పలు అంశాలపై వర్క్‌షాప్ నిర్వహించారు. రాష్ట్ర హైకోర్టు జడ్జి, పశ్చిమగోదావరి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి బి.కృష్ణమోహన్, రాష్ట్ర హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి ఆధ్వర్యంలో న్యాయ అధికారుల వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా జస్టిస్ కృష్ణమోహన్ మాట్లాడుతూ న్యాయ అధికారులను ప్రామిసరి నోట్ దావాల్లో అమలు, పిటీషన్ (ఈపీ), ఇతర అంశాలపై న్యాయ విజ్ఞానంతో సన్నద్ధం చేయడానికి వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. రిసోర్స్ పర్సన్ రిటైర్డ్ న్యాయమూర్తి, ఏపీఏటీ మాజీ చైర్మన్ వైవీ రామకృష్ణ ఎగ్జిబిషన్ ఆఫ్ డిగ్రీ ఫర్ ఎవిక్షన్ అండ్ డెలివరీ, డిటర్మినేషన్ అనే చట్టాల్లో సవరణలను తెలియజేశారు. వర్క్‌షాప్‌లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయమూర్తులు పాల్గొన్నారు. ముందుగా వర్క్‌షాప్‌నకు విచ్చేసిన హైకోర్టు జడ్జి జస్టిస్ బి.కృష్ణమోహన్‌కు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్, కలెక్టర్ వె.ప్రసన్నవెంకటేష్, ఏలూరు ఆర్డీఓ ఎన్ఎస్‌కే ఖాజావలీ, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయమూర్తులు, ఏలూరు బార్ అసోసియేషన్ సభ్యులు ఎ.విజయకుమార్, న్యాయవాదులు తదితరులు పూల మొక్కను అందజేసి స్వాగతం పలికారు.

కార్యకర్తలపై దాడులు సహించం

మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ



పెంటపాడు మండల పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడులు చేస్తే సహించేది లేదని మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. తాడేపల్లిగూడెంలోని పార్టీ కార్యాలయంలో శనివారం పెంటపాడు మండల కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్న సమయంలో పార్టీ, మతం, కులం చూడకుండా అర్హులందరికీ జగన్ పథకాలు అందించారన్నారు. అయితే ప్రస్తుతం కూటమి అధికారంలోకి రావడంతో ఆయా పార్టీల శ్రేణులు అభివృద్ధి శిలాఫలకాలు ధ్వంసం చేయడం, కక్ష రాజకీయాలకు తెరతీయడం సరికాదన్నారు. ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలన్నింటినీ సీఎం చంద్రబాబు అమలు చేయాలని డిమాండ్ చేశారు. జగన్ మాదిరిగా సంక్షేమ పథకాల హామీలు చేసే శక్తి సీఎం చంద్రబాబుకు లేదని, అల్లావుద్దీన్ దీపం ఉంటేనే గాని అవి అమలు కావని చంద్రబాబుపై విమర్శలు చేశారు.

కార్యకర్తలూ కలత చెందవద్దు

సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి చెందామని కార్యకర్తలు కలత చెందవద్దని, రానున్న రోజుల్లో ప్రతిఒక్కరూ పార్టీ విజయానికి కృషి చేయాలని మాజీ మంత్రి కొట్టు అన్నారు. అధికార పక్షం ఇచ్చిన హామీలను అమలు చేయలేక ప్రజలకు మొఖం చాటేసే రోజులు రానున్నాయని, అప్పుడు ప్రజలకు అండగా నిలుద్దామన్నారు. ఆరు నెలలు తిరగకుండానే కూటమి ప్రభుత్వం బండారాన్ని ఎండగడదామన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు దిగులు చెందవద్దని, జగన్ నాయకత్వంలో ప్రతిఒక్కరికీ న్యాయం జరుగుతుందన్నారు. వైఎస్సార్‌సీపీని కాపాడుకుంటూనే అధికార పక్ష చర్యలను ఎండగడదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, ఎంపీపీ దాసరి హైమావతి, జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పులూరి వరలక్ష్మి, గుండుమోగుల సాంబయ్య, కట్టుబోయిన కృష్ణప్రసాద్, ముదునూరి సర్పంచ్ బావన ధాన్యలక్ష్మి, బోణం వీరయ్య, సంపతిరావు కృష్ణారావు, జామి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కక్ష సాధింపులు మానండి

పెనుగొండ: రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రభుత్వ భవనాలు, వైఎస్సార్ విగ్రహాల ధ్వంసం, నాయకులు, కార్యకర్తలపై దాడులు చేయడమే కాకుండా తాడేపల్లిలో అన్ని అనుమతులతో నిర్మిస్తున్న వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని కూల్చివేయడం దారుణమని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వైట్ల కిషోర్‌కుమార్ అన్నారు. శనివారం ఆచంటలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోర్టు ఆదేశాలను ధిక్కరించి న్యాయవ్యవస్థను అపహాస్యం చేశారన్నారు. విశాఖలోని టూరిజం భవనాలపై ఎల్లో మీడియా దుష్ప్రచారానికి పూనుకుందన్నారు.

జిల్లాలో 231 మి.మీ వర్షపాతం

భీమవరం: జిల్లాలోని 20 మండలాల పరిధిలో శనివారం ఉదయం 231 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. తాడేపల్లిగూడెంలో అత్యధికంగా 43 మిల్లీమీటర్లు నమోదుకాగా పెంటపాడులో 35, ఉండిలో 18.2, పాలకోడేరులో 17.2, ఆకివీడులో 14, పాలకొల్లులో 16.4, కాళ్లలో 11.2, యలమంచిలిలో 10, గణపవరంలో 102 మిల్లీమీటర్ల వర్షం పడింది. అలాగే పెనుమంట్రలో 9.2, పెనుగొండలో 4, ఆచంటలో 3.6, పోడూరులో 7.4, మొగల్తూరులో 2.6, నరసాపురంలో 5,వీరవాసరంలో 3.2, భీమవరంలో 4.2, తణుకులో 8, అత్తిలిలో 6.4, ఇరగవరంలో 3.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

చూడచెక్కని శిల్పాలు



సీసాలో దారు శిల్పాలు



అగ్గిపెట్టెలో మంచాలు



కొబ్బరి చెక్కలతో కళాకృతి

అబ్బురపరిచే కళా నైపుణ్యం

సండే స్పెషల్

తాడేపల్లిగూడెం (టీఓసీ): చెక్క ముక్కలతో చూడచక్కని శిల్పాలను రూపొందిస్తూ ఆకట్టుకుంటున్నారు.. క్లిష్టమైన సీసాలో దారు శిల్పకళతో అబ్బురపరుస్తున్నారు తాడేపల్లిగూడేనికి చెందిన అనుములపూడి కామేశ్వరరావు. వృత్తిరీత్యా వడ్రంగి పని చేసే ఆయన చదివింది ఏడో తరగతి మాత్రమే. అయినా వృత్తిలో నైపుణ్యం కనబర్చడంతో పాటు సీసాల్లో శిల్పాలను రూపొందించే కళలో ప్రతిభ చూపుతున్నారు. చిన్న, పెద్ద సీసాల్లో చెక్క శిల్పాలను అమరుస్తున్నారు. ఇలా సీసాల్లో మడత మంచం, మంచం, పడక కుర్చీ, డైనింగ్ టేబుల్, గాజులు స్టాండ్, నిచ్చెన ఇలా ఎన్నోరకాల శిల్పాలను అమర్చారు. ముందుగా సీసా సైజు ఆధారంగా కొలతకు సరిపడా చెక్కలను కట్ చేసి తాను అనుకున్న ఆకృతిని రూపొందిస్తారు. తర్వాత ఈ ఆకృతిని ఏ భాగానికి ఆ భాగం విడదీసి, ఒక్కో భాగాన్ని సీసాలోకి ఎక్కించి అందులోనే ఆకృతిని అమర్చడంలో నైపుణ్యం సాధించారు. దీంతోపాటు అగ్గిపెట్టెలో మంచాలు, చెక్కలతో గొలుసులు తయారు చేయడం, కొబ్బరి చెక్కలతో కళాకృతులు రూపొందించడంలోనూ ఆయన ఔరా అనిపిస్తున్నారు. మాజీ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు, పట్టణ ప్రముఖుల నుంచి కామేశ్వరరావు సత్కారాలు పొందారు.



సీసాలో దారు శిల్పాలు

నైపుణ్యం, ఓపిక అవసరం



చెక్కలను ఉపయోగించి విడి భాగాలను సీసాలో కూర్పు చేయడానికి నైపుణ్యం ఎంతో అవసరం. సాధారణంగా ఒక సీసాలో వస్తువును సమకూర్చడానికి వారం, పది రోజులు, కొన్ని వస్తువులకు నెలలు పడుతుంది. ఈ పనికి ఓపిక ఎంతో అవసరం. ఇప్పటివరకు పన్నెండు రకాల వస్తువులను ఇలా రూపొందించాను. పెద్ద సీసా లభిస్తే అందులో మేడ నిర్మించాలనేది నా లక్ష్యం. ఈ కళను నేను ఎక్కడా నేర్చుకోలేదు. భిన్నమైన ఆలోచనలతోనే ఈ కళ అలవర్చుకున్నాను. ఈ కళతో పాటు సంగీతంలో ప్రావీణ్యం ఉంది. డోలక్ కళాకారుడిగా ఆధ్యాత్మిక కార్యక్రమాలకు సహకారం అందిస్తున్నాను.

– అనుములపూడి కామేశ్వరరావు, వడ్రంగి, తాడేపల్లిగూడెం

సమైక్యతా భావం అలవర్చుకోవాలి

కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ



ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ

భీమవరం: బాలలు విద్యార్థి దశ నుంచే దేశభక్తి, సమైక్యతాభావం అలవర్చుకోవాలని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. శనివారం స్థానిక ఏఆర్‌కేఆర్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులతో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సమైక్యత ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం జాతీయ సమైక్యతతోనే నడుస్తుందని, ప్రధాని మోదీ స్ఫూర్తితో ప్రతిఒక్కరూ దేశాభివృద్ధికి సహకరించాలన్నారు. తాను విద్యార్థి దశలో ఎస్పీఎల్‌గా జాతీయ సమైక్యత కార్యక్రమాలను నిర్వహించానన్నారు. ఇటువంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లో చైతన్యం కలుగుతుందన్నారు. విద్యార్థులకు ఆయన విద్యా సామగ్రి అందజేశారు. అనంతరం 400 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. హైస్కూల్ హెచ్ఎం ఏవీ సత్యనారాయణ, లయన్స్ క్లబ్ పట్టణ ఉపాధ్యక్షుడు నరహరశెట్టి కృష్ణ, కొండ్రు శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పంట కాలువలోకి కారు బోల్తా



పడాల సమీపంలో పంట కాలువలోకి బోల్తా కొట్టిన కారు

తాడేపల్లిగూడెం రూరల్: కారు డివైడర్‌ను ఢీకొని ఆపై పంట కాలువలోకి బోల్తా కొట్టిన సంఘటన శనివారం మండలంలోని పడాల అయ్యప్పస్వామి ఆలయం సమీపంలో చోటు చేసుకుంది. నిడదవోలు నుంచి ఏలూరు వైపు కారు వెళ్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. ముందుగా డివైడర్‌ను ఢీకొని తదుపరి పల్టీలు కొడుతూ కాలువలోకి బోల్తా కొట్టిందని స్థానికుల సమాచారం. ప్రమాదంలో ఎవరికీ ప్రాణ హాని సంభవించలేదు.

ధాన్యం సొమ్ము చెల్లించాలని వినతి

ఆకివీడు: రబీ ధాన్యం సొమ్ము నేటికీ చెల్లించలేదని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి శేషమోహన రంగారావు చెప్పారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 28 నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించిన ధాన్యానికి సంబంధించిన సొమ్ము నేటికీ రైతుల ఖాతాల్లో జమ చేయలేదన్నారు. ఖరీఫ్ పనులు ప్రారంభమయ్యాయని రైతుల చేతిలో చిల్లి గవ్వలేదని, ఖరీఫ్ సాగుకు కావలసిన పెట్టుబడులు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ధాన్యం అమ్మిన 15 రోజుల్లోనే సొమ్మును గతంలో చెల్లించారన్నారు. ఖరీఫ్ సాగు ప్రారంభమవుతున్న తరుణంలో ప్రభుత్వం అన్నదాతల్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రొయ్య మేత.. రైతుకు మోత

టన్నుకు రూ. 20 వేలు పెరగడంతో ఆందోళన

భీమవరం : రొయ్యల మేత ధర పెరుగుదల రైతులను కలవరపాటుకు గురిచేస్తోంది. రొయ్యల ధరలు తగ్గడం మేతలు, ఫీడ్, కూలీల ఖర్చు విపరీతంగా పెరగడంతో ఆక్వా రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. గత ప్రభుత్వం రొయ్యల మేతల ధరల పెరుగుదలకు అడ్డుకట్టవేసినప్పటికీ అప్పటికే పెరిగిన ధరలతో పెట్టుబడులు ఇబ్బడిముబ్బడిగా పెరిగాయి. చిన్నతరహా రైతులు రొయ్యల సాగు పట్ల విముఖత చూపే పరిస్థితి ఏర్పడింది. దీంతో రొయ్యల చెరువుల లీజులు తగ్గుముఖం పడుతున్నాయి. గతంలో ఎకరం పొలంలో ఏడాది పాటు రొయ్యలు సాగుచేయడానికి భూమి గల రైతులు రూ.1.80 లక్షల వరకు లీజు డిమాండ్ చేయగా ప్రస్తుతం లీజు రూ.లక్ష లోపే కావడం విశేషం. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ, ఫీడ్, సీడ్ ధరలపై నియంత్రణ, రొయ్యల ధరలను మద్దతు ధరకు కొనుగోలుచేసేలా అనేక చర్యలు చేపట్టినా రొయ్యల కొనుగోలుదారులు సిండికేట్‌గా ఏర్పడి రొయ్యల పెట్టుబడులు పెరిగిన సమయంలో ధరలు తగ్గించడం, ఫీడ్ ఉత్పత్తిదారులు ధరలను పెంచడం వంటి కారణాలతో రైతులు ఇబ్బంది పడుతూనే ఉన్నారు. రొయ్యల మేతకు అవసరమైన సోయాబీన్ ధరలు పెరిగాయనే నెపంతో టన్ను మేతపై ఏకంగా రూ.20 వేలు వరకు అదనంగా పెంచేయడంతో ఆక్వా రైతులు కుదేలవుతున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సుమారు 1.20 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగుచేస్తున్నారు.

మేత వినియోగాన్ని బట్టి రొయ్యల దిగుబడి

ఆక్వా రైతులు చెరువుల్లో వేసే సీడ్ తినే మేత వినియోగం మేరకు దిగుబడి అంచనా వేస్తారు. చెరువుల్లో నాలుగు వైపుల ట్రేలు అమర్చి వాటిలో రొయ్యల మేత వేస్తారు. మేతవేసిన ప్రతిసారి ట్రేల్లో వేసి మేతను గంట నుంచి గంటన్నరలోగా పూర్తిగా తినేదాన్ని బట్టి చెరువుల్లో ఏ మేరకు రొయ్యలున్నాయో అంచనా వేస్తారు. చెరువుల్లోని రొయ్యల సంఖ్యను బట్టి ఒక పంటకు ఎకరానికి 4 టన్నుల వరకు మేతను వినియోగిస్తారు. పేరొందిన కొన్ని కంపెనీలు రొయ్యల మేతను టన్ను ధర గతంలో రూ.70 వేలు పలుకగా ప్రస్తుతం రూ.90 వేలుకు చేరిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివిధ తెగుళ్ళ నివారణకు వినియోగించే కెమికల్స్ ధరలు కూడా ఆకాశానంటుతుండడంతో పెట్టుబడులు తలకుమించిన భారంగా తయారైందని వాపోతున్నారు. కెమికల్స్ ధరలు పెరగడంతో అనేకమంది రైతులు తెగుళ్ల నివారణకు నత్తమాంసం, ఆల్చిప్పల మాంసంతోపాటు వివిధ రకాల సంప్రదాయ మందులను వినియోగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.



రొయ్యలకు వినియోగించే ఫీడ్ బస్తాలు

ప్రస్తుతం రొయ్యల ధరలు ఇలా

కౌంట్	కిలో రూ.	కౌంట్	కిలో రూ.
100	200	60	260
90	210	50	280
80	220	40	320
70	240	30	430

తీవ్రంగా నష్టపోతున్న రైతులు



ఆక్వా రంగానికి సంబంధించిన మేతల ధరలు పెరుగుతుంటే రొయ్యల ధరలు మాత్రం తగ్గిపోతున్నాయి. ఇదే సమయంలో నాణ్యత లేని సీడ్ కారణంగా రొయ్యలకు ఎక్కువగా తెగుళ్ల సోకడంతో మందులు కూడా అధికంగా వినియోగించాల్సి రావడంతో పెట్టుబడులు పెరిగి ఆక్వా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రైతులకు కష్టాలు, కన్నీళ్లే మిగులుతున్నాయి.

– గాదిరాజు వెంకట సుబ్బరాజు(జీకేఎఫ్), ఆక్వా రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి, భీమవరం

ఆక్వా రంగం అతలాకుతలం




పెరుగుతున్న పెట్టుబడులు తగ్గుతున్న రొయ్యల ధరలతో ఆక్వా రైతుల పరిస్థితి ఆందోళనకరంగా తయారైంది. సీడ్, ఫీడ్ ధరలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. ఫీడ్, సీడ్ ధరలను ప్రభుత్వం అదుపుచేయడమేగాక నాణ్యమైన ఫీడ్, సీడ్ రైతులకు అందించేందుకు రొయ్యల ధర నిలకడగా ఉండేందుకు ప్రభుత్వం కృషిచేయాలి.

– తాడాల దుర్గావరప్రసాద్, రొయ్యల రైతు, కొణితివాడ

గూడెం అమ్మాయి టాలీవుడ్‌లో మెరుపులు

- నటనతో అలరిస్తున్న షజ్నశ్రీ
- 'ప్రభుత్వ జూనియర్ కళాశాల' సినిమాతో తాజాగా సందడి



ప్రభుత్వ జూనియర్ కళాశాల సినిమా

తాడేపల్లిగూడెం: రేలంగి, కృష్ణవంశీ వంటి ఎందరో తాడేపల్లిగూడెం నుంచి తెలుగు సినీ రంగంలో మెరిశారు. ఇటీవల గూడెం అమ్మాయి షజ్నశ్రీ టాలీవుడ్‌లో సందడి చేస్తోంది. తాజాగా వచ్చిన 'ప్రభుత్వ జూనియర్ కళాశాల' సినిమాలో కుర్ర హృదయాలను గిలిగింతలు పెడుతుంది. కామెడీ, డ్రామా, రొమాంటిక్ అంశాలతో ఈ నెల 21 విడుదలైన ఈ సినిమా యూత్‌ను ఆకర్షిస్తోంది. హీరోయిన్ షజ్నశ్రీ చక్కటి అభినయంతో ఈ సినిమాలో ఆకట్టుకున్నారు. షజ్నకు ఇది మూడో చిత్రం. అంతకు ముందు చెక్‌పోస్టు 1995, బెస్ట్ కపుల్ సినిమాలలో నటించింది.



సినిమా ఆరంగేట్రం

తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన ఎన్.పావని (షజ్నశ్రీ) ఇంటర్ వరకు గూడెంలోనే చదివింది. ఫ్యాషన్ డిజైనింగ్‌పై ఉన్న మక్కువతో బెంగళూరు వెళ్లింది. డ్రీమ్‌జోన్ ఇన్‌స్టిట్యూట్‌లో మూడేళ్ల పాటు కోర్సు చేసింది. తర్వాత హైదరాబాద్‌లో అదృష్టాన్ని పరీక్షించుకుంది. నటనపై షజ్నశ్రీ ఆసక్తిని గమనించిన ఓ సంస్థ 'చెక్‌పోస్టు 1995' సినిమాలో అవకాశం కల్పించింది. తొలి సినిమాలో నటనతో ప్రశంసలు అందుకుంది. ఆ సినిమా తర్వాత బెస్ట్ కపుల్ సినిమా చేసింది. మూడో చిత్రంగా వచ్చిన ప్రభుత్వ జూనియర్ కళాశాల మంచి పేరు తీసుకొచ్చింది.

నా టాలెంట్ నిరూపించుకుంటా : షజ్నశ్రీ

మా నాన్న పేరు నూకెళ్ల వేణుగోపాలకృష్ణ, అమ్మ పద్మ. వచ్చిన సినీ అవకాశాలను సద్వినియోగం చేసుకుంటున్నాను. ప్రభుత్వ జూనియర్ కళాశాల యువతను ఆకట్టుకుంటుంది. టాలెంట్ ప్రూవ్ చేసుకుంటూ సొంతంగా గుర్తింపు సాధించి హీరోయిన్‌గా రాణించాలన్నదే నా లక్ష్యం. మరో రెండు సినిమాలకు సైన్ చేశాను.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



ఘటనా స్థలంలో దేవరాజు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై జ్యోతిబసు



దేవరాజు (ఫైల్)

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని జల్లేరు పెట్రోల్ బంక్ వద్ద లారీ ఢీకొన్న ఘటనలో ఒక యువకుడు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం గ్రామానికి చెందిన చుండ్రు దేవరాజు(19), బంటుమిల్లి నాగరాజులు వర్జీనియా పొగాకు పనులకు వెళ్తుంటారు. శనివారం వీరిద్దరూ ద్విచక్రవాహనంపై లక్కవరం నుంచి చల్లవారిగూడెంలో పొగాకు తొలిచే పనులకు బయలుదేరారు. జల్లేరు వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో దేవరాజు మీదుగా లారీ చక్రం వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. నాగరాజు కుడి కాలికి తీవ్ర గాయమైంది. గాయపడిన నాగరాజును జంగారెడ్డిగూడెం ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాద ఘటన విషయాన్ని తెలుసుకున్న ఎస్సై జ్యోతిబసు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద ఘటనా ప్రాంతాన్ని, దేవరాజు మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పెళ్లికి వెళ్లి మృత్యువాత



కార్తీక్ మృతదేహం వద్ద విలపిస్తున్న చిన్నారి మావయ్య



కార్తీక్ (ఫైల్)

ఏలూరు రూరల్ : బంధువుల ఇంటికి వెళ్లి ఓ బాలుడు మృత్యువాత పడ్డాడు. ఏలూరు శివారు మాదేపల్లి రోడ్డు, ఇందిరాకాలనీకి చెందిన అంగులూరి కార్తీక్ (12) మూడురోజుల క్రితం తన మేనమామతో కలిసి బంధువుల ఇంటికి భద్రాచలం వెళ్లాడు. శనివారం ఉదయం స్నేహితులతో ఆడుకుంటూ పక్కనే ఉన్న గోదావరిలో స్నానానికి వెళ్లాడు. కేరింతలు కొడుతూ ఆడుకుంటున్న పిల్లలు నీట మునిగిపోయారు. ప్రవాహం దాటికి కొద్ది దూరం కొట్టుకుపోయారు. స్థానిక యువకులు గోదావరిలోకి దూకి పిల్లలను ఒడ్డుకు చేర్చారు. కార్తీక్ దొరకకపోవడంతో మేనమామతో కలిసి యువకులు వెదుకులాట కొనసాగించారు. అఖరికి కార్తీక్‌ను ఒడ్డుకు చేర్చారు. అప్పటికే అతను మృతిచెందాడు. కొన్నేళ్ల క్రితం తల్లిదండ్రులను కోల్పోయిన కార్తీక్ తన అక్క, తమ్ముడితో కలిసి ఏలూరు ఇందిరాకాలనీలో పెద్దమ్మ వద్ద ఉంటున్నాడు. బాలుడు మృతితో కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరయ్యారు.

విద్యుత్ షాక్‌తో కౌలు రైతు మృతి

ఆగిరిపల్లి : మండలంలోని ఈదులగూడెంలో విద్యుత్ షాక్‌తో కౌలు రైతు మృతి చెందాడు. ఈదులగూడెంకు చెందిన పండిబోయిన నాగేశ్వరరావు(45) విద్యుత్ షాక్‌తో మరణించాడు. స్థానికుల వివరాల ప్రకారం నాగేశ్వరరావు శనివారం ఉదయం గేదెలు కొబ్బరి తోటలోకి తోలుకు వెళ్లాడు. ఫెన్సింగ్ తీగలపై విద్యుత్ వైర్లు పడగా.. నాగేశ్వరరావు ఆ తీగలలో నుంచి బయటకు వచ్చే క్రమంలో విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మధ్యాహ్నం వరకు ఇంటికి రాకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు తోటలో వెళ్లి చూడగా అప్పటికే నాగేశ్వరరావు మృతి చెంది ఉన్నాడు.

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర



అత్తిలిలో హనుమాన్ శోభాయాత్రలో పాల్గొన్న కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, స్వామీజీలు



అత్తిలిలో హనుమాన్ శోభాయాత్ర

అత్తిలి: హనుమాన్ శక్తి జాగరణ సమితిచే హనుమాన్ శోభాయాత్ర శనివారం సాయంత్రం అత్తిలి గ్రామంలో వైభవోపేతంగా జరిగింది. అత్తిలి డిగ్రీ కళాశాల నుంచి కాలువగట్టు, గోపాలస్వామి గుడివీధి, శివాలయం, తణుకు రోడ్డుమీదుగా శ్రీబాలాజీ వెంకటేశ్వరస్వామి ఆలయం వరకు శోభాయాత్ర జరిగింది. శోభాయాత్ర ముందు కోలాట భజనలు, తీన్మార్ డప్పులు, హనుమాన్ వేషధారణలు, ఏనుగు అంబారీతో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, శ్రీనివాసానంద సరస్వతి స్వామీజీ, స్వరూపానంద స్వామీజీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసానంద సరస్వతి స్వామీజీ మాట్లాడుతూ హిందుత్వ విశిష్టతను ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు స్వామి వివేకానంద అని అన్నారు. మక్కామల పీఠం శ్రీధర్ స్వామీజీ మాట్లాడుతూ పాశ్చాత్య సంస్కృతి, సంప్రదాయాల నుంచి హిందువులు బయటపడాలన్నారు. తణుకు పట్టణానికి చెందిన నృత్య కళాకారిణి మొగంటి హర్షిత నాగశ్రీ ప్రదర్శించిన నాట్య ప్రదర్శన ఆహూతులను అలరించింది.

అత్తిలి స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్ట్‌కు చర్యలు

అత్తిలిలో ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్ట్‌కు చర్యలు తీసుకుంటామని కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ చెప్పారు. అత్తిలిలో మాట్లాడుతూ సమస్యను పరిష్కరించాలని రైల్వే ఉన్నతాధికారులను కలిసి విన్నవించానన్నారు. 15 రోజుల్లో ఒక బృందం పర్యటించి నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. అవసరమైతే కేంద్ర రైల్వే శాఖ మంత్రిని కలిసి సమస్య వివరిస్తానని చెప్పారు.

జూలై 3న ఆక్వా రైతుల సమావేశం

పాలకొల్లు సెంట్రల్ : ఆక్వా రైతుల సమస్యలు పరిష్కారం కావాలంటే రైతులందరూ సంఘటితంగా పోరాటం చేయాలని జై భారత్ క్షీరారామ ఆక్వా రైతు సంఘం అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీభగవాన్ రాజు అన్నారు. శనివారం స్థానిక పూలపల్లి ఎస్ఎస్ఎస్ కళ్యాణమండపంలో ఆక్వా రైతుల రాష్ట్ర కార్యవర్గ సమావేశం అనంతరం విలేకర్ల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా గాంధీభగవాన్ రాజు మాట్లాడుతూ ఆక్వా రైతులకు గిట్టుబాటు ధరలు లేక, సరుకు కొనుగోలు చేయక, ఫీడ్ రేట్లు పెరగడంతో తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. విద్యుత్‌లో ఆక్వా రైతులకు అందించే సబ్సిడీని ఆక్వా జోన్ నాన్ ఆక్వాజోన్‌ల వారీగా విడదీయకుండా ఆక్వా రైతులందరికీ రూ. 1.50 లు చొప్పున ధరలు కేటాయించేలా చర్యలు చేపట్టాలన్నారు. జూలై 3న పూలపల్లి ఎస్ఎస్ఎస్ కల్యాణమండపంలో సుమారు 10 వేల మంది ఆక్వా రైతులతో సమావేశం ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బోణం చినబాబు, కర్నేని గౌరునాయుడు, త్సవటపల్లి నాగభూషణం, జాన్‌రాజు, కోడి విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఆక్వా సంఘ నాయకులు

వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీ చించిన వారిని శిక్షించాలి

కాళ్ల : వైఎస్సార్‌సీపీ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని చింపేయడం దుర్మార్గపు చర్యని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. బొండాడ గ్రామంలో చిన్నపేటలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అభిమానులు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అయితే శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఫ్లెక్సీ చింపేశారని అసహనం వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఆగ్రహం వ్యక్తం చేశారు.



బొండాడలో ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీని చించేసిన దృశ్యం

ఐటీఐల్లో ప్రవేశాలకు మరోసారి కౌన్సిలింగ్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో ప్రవేశాల నిమిత్తం ఈ నెల 24న మరోసారి కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు ఐటీఐ ప్రధానాధికారి పీ రజిత తెలిపారు. తొలి విడత కౌన్సెలింగ్‌కు 454 మంది అర్హత పొందగా వారిలో 252 మంది కౌన్సిలింగ్‌కు హాజరయ్యారని, వారిలో 180 మంది జిల్లాలోని వివిధ ఐటీఐ కళాశాలల్లో ప్రవేశాలు పొందారని వివరించారు. మొదటి దఫా కౌన్సెలింగ్‌లో అర్హత పొంది హాజరుకాలేకపోయిన అభ్యర్థులకు, అర్హత ఉండి ప్రవేశాలు పొందలేక పోయినవారికి ఈనెల 24న నిర్వహించే కౌన్సెలింగ్‌లో మరో అవకాశం కల్పిస్తామన్నారు. 24న ఉదయం 10 గంటలకు 1 నుంచి 224 మెరిట్ నెంబర్ కలిగిన వారికి, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మెరిట్ నెంబర్ 225 నుంచి 454 వరకూ కౌన్సిలింగ్ నిర్వహిస్తామని చెప్పారు.

నల్లతాచు పట్టివేత



జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం వై.జంక్షన్ దగ్గర ఉన్న పకృతి నర్సరీ ఎదురుగా సీట్ కవర్స్ షాపులోకి నల్ల తాచు దూరింది. ఇది గమనించిన షాపు యజమాని స్నేక్ సేవియర్స్ సొసైటీ సంస్థకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న సంస్థ అధ్యక్షుడు చదలవాడ క్రాంతి పామును సురక్షితంగా పట్టుకున్నారు. సమీపంలోని అటవీప్రాంతంలో విడిచిపెట్టారు.

24న రైతు సమస్యలపై కలెక్టర్‌ను కలుస్తాం

ఏలూరు (టూటౌన్) : జిల్లాలోని రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 24న ఏలూరు జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ తెలిపారు. పవరుపేటలోని అన్నే భవన్‌లో జిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ నర్సింహా అధ్యక్షతన శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ధాన్యం బకాయి సొమ్ములు అందక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పెట్టుబడి సాయం రూ.20 వేలు విడుదల చేయాలని కోరారు. కౌలు రైతులకు వడ్డీలేని పంట రుణాలు అందించాలని కోరారు.

క్లుప్తంగా

ఘనంగా పుష్పయాగోత్సవం



బల్లిపాడులో వెంకటేశ్వరస్వామికి పుష్పయాగోత్సవం నిర్వహించిన దృశ్యం

అత్తిలి: మండలంలోని బల్లిపాడు శ్రీమదనగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో వెంకటేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవాలు ముగింపు సందర్భంగా స్వామివారికి పుష్పయాగోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామికి విశేష పూజలు జరిపి, పుష్పాలతో విశేషంగా అలంకరించిన ఊయలలో పవళింపు సేవ జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు ఈకార్యక్రమానికి హాజరై స్వామివారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు గారపాటి ధర్మయ్య, ముత్యాల నాగేశ్వరరావు, గారపాటి బాబ్జి, ప్రగడ నాగేశ్వరరావు, ఆకుల రామచంద్రరావు, గారపాటి ఆశోక్, కసిరెడ్డి అప్పారావు, దాసం ఆదినారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

పెంట్లమ్మకు విశేష పూజలు



పెంట్లమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

పెంటపాడు: మండలంలోని కె. పెంటపాడు గ్రామ దేవత పెంట్లమ్మ అమ్మవారికి పౌర్ణమి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. అధిక మహిళలు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆదిరెడ్డి ఎర్రన్న, నరసమ్మ దంపతులు, ఆదిరెడ్డి సొమ్మ, ముత్యాల సూర్య నారాయణ(పండు)లు ఈ సందర్భంగా అమ్మవారికి అన్నసమారాధనకు ప్రత్యేక విరాళాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వలవల బాబ్జి, పెంటపాడు మండల టీడీపీ అధ్యక్షుడు కిలపర్తి వెంకటరావు, ఆలయ కమిటీ చైర్మన్ పంతం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతోనే ఆరోగ్యం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్

పెంటపాడు: యోగాతోనే మంచి ఆరోగ్యం సాధ్యపడుతుందని గూడెం మున్సిపల్ కమిషనర్ డి. మురళీకృష్ణ పేర్కొన్నారు. జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని గూడెం ప్రాంతంలో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా యోగా సంస్థలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో బుద్ధయోగా పౌండేషన్ యోగా గురువు జి. రూప, ప్రత్తిపాడు ఏఎస్ఆర్ ఎడ్యుకేషనల్ చైర్మన్ ఎ. నరేష్ బాబు, హోమియోపతి కళాశాల ప్రిన్సిపాల్ యుఎస్వీ ప్రసాద్, యోగా టీచర్ బడుగు చంద్రశేఖర్ తదతరులు పాల్గొన్నారు. యోగా దినోత్సవం పురస్కరించుకొని కడకట్ల హైస్కూల్, ప్రత్తిపాడు ఏఎస్ఆర్ హోమియో కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులను కమిషనర్ అభినందించారు.

'గూడెం'లో 43 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణ, మండలంలో గడిచిన 24 గంటల్లో 43 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ మురళీకృష్ణ శనివారం తెలిపారు. కాగా పెంటపాడు మండలంలో 35 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందన్నారు.

ఘనంగా తెలుగు సాహితీ సమాఖ్య స్వర్ణోత్సవ సభ



సాంస్కృతిక కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీటీసీ): స్థానిక బీవీఆర్ కళాకేంద్రంలో తెలుగు సాహితీ సమాఖ్య స్వర్ణోత్సవాలు సందర్భంగా శనివారం రాత్రి సమాఖ్య 652వ కార్యక్రమం వైభవంగా జరిగింది. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మండ బ్రహ్మాజీ, పైలు శ్రీనివాసరావులు ఆధ్వర్యంలో డాక్టర్ గజల్ శ్రీనివాస్‌కు గజల్ సామ్రాట్ అవార్డు ప్రదానోత్సవం చేశారు. తొలుత సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. పట్టణ ప్రముఖులు గట్టిం మాణిక్యాలరావు, బుద్దాల వెంకట రామారావు, కర్రి ప్రభాకర్ బాలాజీ, గ్రంధి సత్యనారాయణ, బడుగు చంద్రశేఖర్, బాపయ్య శర్మ, జంధ్యాల నాగేశ్వరరావు, శారదా భగవతారిణి, మండవల్లి నాగేంద్రరావు, పీటీ వెంకన్న, సాహితీ సభ్యులు, కళాకారులు పాల్గొన్నారు.

దోమకాటు.. ఆరోగ్యానికి చేటు

- మలేరియాపై పోరాటం వేగవంతం
- కొనసాగుతున్న మలేరియా మాసోత్సవాలు
- ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు



ప్రభుత్వ హాస్టళ్ల వద్ద మందు పిచికారి చేస్తున్న దృశ్యం



మలేరియాపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పెంటపాడు: ప్రపంచ వ్యాప్త ఆరోగ్య సమతుల్యత సాధనకై మలేరియా వ్యతిరేక పోరాటాన్ని వేగవంతం చేద్దామంటూ ఆరోగ్య కార్యకర్తలు ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈనెల ఒకటో తేదీ నుంచి 30వ తేదీ వరకు మేలరియా వ్యతిరేక మాసోత్సవాలను నిర్వహించాలని వైద్య ఆరోగ్యశాఖ నిర్ణయించింది. జాతీయ కీటక జనితత వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టారు. వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వివరిస్తున్నారు. నిల్వ నీటిలో దోమలు వృద్ధి చెందకుండా నివారణ మందులను స్ప్రే చేయాలని సూచిస్తున్నారు. గంబూషియా చేపలను వదలడం ద్వారా దోమల లార్వాలను అరికట్టవచ్చని సూచిస్తున్నారు. ఇళ్లలోని గోడలపై సింథటిక్ పైరిత్రాయిడ్(ఎసీఎం) అవసరాన్ని బట్టి దోమల మందులను స్ప్రే చేయాలని అవగాహన కల్పిస్తున్నారు. దోమ తెరలు, దోమ చక్రాల ద్వారా దోమల నుంచి రక్షణ పొందవచ్చని సూచిస్తున్నారు.

మలేరియా లక్షణాలు

చలి, వణుకుతో కూడిన జ్వరం, అనాఫిలిస్ దోమల ద్వారా వ్యాపిస్తుందనిచెబుతున్నారు. ప్లాస్మోడియా జాతికి చెందిన రెండు క్రిముల వల్ల మలేరియా వ్యాప్తి చెందుతుందని పేర్కొంటున్నారు. దీనిలో వైవాక్ మలేరియా తక్కువ బాధిస్తే, పాల్ఫీఫారం మలేరియా ఎక్కువ బాధించడమే కాకుండా కొన్ని పరిస్థితుల్లో ప్రాణాంతక స్థాయికి చేరుతుందని విశ్లేషిస్తున్నారు. దోమ కుట్టిన ఎనిమిది నుంచి12 రోజుల్లో వ్యాధి లక్షణాలు బయటపడతాయని, చిన్న పిల్లలకు గర్భిణులకు ఈవ్యాధి ప్రమాదకరమైనదని చెబుతున్నారు. రక్తపరీక్షలు అనగా (బీఎస్), ఆర్డీటెస్ట్) ద్వారా ఈ వ్యాధిని నిర్ధారించడవచ్చని పేర్కొంటున్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



మలేరియా వ్యాధి అనాఫజలిస్ అనే ఆడదోమద్వారా వ్యాప్తి చెందుతుంది. మలేరియా వ్యాధి స్థానిక వాతావరణ పరిస్థితులపై ఆదారపడి ఉంటుంది. ఈ వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే డాక్టర్లను సంప్రదించాలి. రక్తమార్పిడి సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోవాలి. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని. ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా డాక్టర్ల సూచనలు పాటించాలి.

– తోట రాజేష్, పెంటపాడు ప్రాథమిక వైద్యాధికారి

నేడు మానవత నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

తణుకు టౌన్: తణుకు మానవత సంస్థ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఈనెల 23వ తేదీన నిర్వహిస్తున్నట్లు మానవత శాంతి ర్యాలీ జిల్లా చైర్మన్ గమిని రాంబాబు తెలిపారు. ఆదివాయం సాయంత్రం తణుకులోని గమిని ఫంక్షన్ హాల్‌లో తణుకు మానవత సంస్థ 2024–25 సంవత్సరానికి నూతన అద్యక్షురాలుగా కఠారి శారదాదేవి, కార్యదర్శిగా బొల్లం రామకాశీ, కోశాధికారిగా అక్కిన కాశీ విశ్వనాథంలతో పాటు ఇతర కార్యక్రవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేస్తారని తెలిపారు. ఈకార్యక్రమానికి ఆధ్యాత్మిక వేత్త నంనడూరి సవిత, మానవత రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ కె రాధాపుష్పావతిలు ముఖ్యఅతిథులుగా పాల్గొంటారని తెలిపారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం

అత్తిలి: బాల్యవివాహాల నిషేధ చట్టంపై అత్తిలి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీయూ పి మమతశ్రీ మాట్లాడుతూ బాలలకు జీవించే హక్కు, రక్షణ పొందే హక్కు, అభివృద్ధి చెందే హక్కు ఉన్నాయన్నారు. బాలల సంరక్షణ పథకం, మిషన్ వాత్సల్య పథకాలపై అవగాహన కల్పించారు. చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి బి నెహమ్య, సీడీపీఓ పి ప్రమోదకుమారి మాట్లాడుతూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు ఎం శ్రీదేవి, కె కుమారి, పి మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్టూడెంట్ కిట్ల పంపిణీ



కె. పెంటపాడులో విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం



ప్రభుత్వ బేసిక్‌స్కూల్లో విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

పెంటపాడు: సర్కారు పాఠశాలల్లో ప్రభుత్వం కార్పొరేట్ విద్య అందజేస్తుందని పెంటపాడు, కె.పెంటపాడు గ్రామాల సర్పంచ్‌లు తాడేపల్లి సూర్యకళ, పీతల సత్యనారాయణలు తెలిపారు. శనివారం మండలంలోని రెండు గ్రామాల్లో విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ చదువుతోనే ఏదైనా సాధ్యమని విద్యార్థులకు తల్లిదండ్రులకు ఆస్తి ఇవ్వకపోయిన చదివిస్తే సరిపోతుందని తానే బంగారు భవిష్యత్తు వేసుకుంటాడన్నారు. విద్యార్థులు ప్రభుత్వం, దాతలు అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు పొట్ల ఏడుకొండలు, దేవాబత్తుల నాగమణి, ఎస్సీ నాయకులు బాబి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు కిలపర్తి వెంకటరావు, ముదునూరు సొసైటీ మాజీ అధ్యక్షుడు దాసరి అప్పన్న, జనసేన నాయకులు సంతోష్, కొవ్వూరి లక్ష్మణరెడ్డి, రెడ్డి సంఘ నాయకులు వేణుగోపాలరెడ్డి, పెంటపాడు గ్రామ ఉప సర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, స్కూలు కమిటీ సంఘ నాయకులు కళింగ లక్ష్మణరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

అత్తిలి: ప్రభుత్వం అందజేస్తున్న స్టూడెంట్ కిట్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్ ధనసూకరాజు చెప్పారు. శనివారం అత్తిలి మండలం కొమ్మర జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను స్థానిక నాయకులు చేతులమీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు ముదునూరి బాలకృష్ణంరాజు, మంతెన పెద్దిరాజు, కాసగాని హనుమంతు తదితరులు పాల్గొన్నారు. మంచిలి ప్రాథమిక పాఠశాల, ఆరవల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చింతారామయ్య, కొవ్వూరి కృష్ణారెడ్డి, వెలగల ప్రసాదరెడ్డి, మేడపాటి కృష్ణకుమారి, ఎంఈవో ఎస్ రమేష్, హెచ్ఎంలు నేలపాటి వెంకటరమణ, నల్లా శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం బకాయిలను విడుదల చేయండి



ఇరగవరంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కౌలు రైతులు

ఇరగవరం: రైతులకు చెల్లించాల్సిన ధాన్యం సొమ్ములు వెంటనే చెల్లించాలని కౌలు రైతు సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. శనివారం ఇరగవరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మునిస్వామి మాట్లాడుతూ గత ప్రభుత్వం దళారులు లేకుండా ధాన్యాన్ని ప్రభుత్వం నేరుగా కొనుగోలు చేసిందని, ధాన్యానికి ప్రభుత్వం చెల్లించాల్సిన సొమ్ము నెలలు గడుస్తున్నా నేటికి చెల్లించకపోవడంతో రైతులు ఆర్థిక ఇబ్బంది పడుతున్నారన్నారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం రైతులకు చెల్లించాల్సిన ధాన్యం బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు గుర్తింపుకార్డులు వెంటనే ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పి సుబ్బారావు, పాల శ్రీను, బొక్కా వెంకటేశ్వరరావు, పిల్లి ఏడుకొండలు, గుబ్బల ముత్యాలరావు, పి నాగేశ్వరరావు, పాలా సత్యనారాయణ పాల్గొన్నారు.

కాలువల్లో పూడిక తీత పనులు



సవిత్రపేటలో డ్రెయిన్లను శుభ్రం చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం: పట్టణంలోని 15వ వార్డు సవిత్రపేట కబేళా వద్ద పూడుకొని పోయిన డ్రెయిన్లను అధికారులు శుభ్రం చేయించారు. ఇవి పూడుకొని పోయి మురుగునీటి పారుదలకు విఘాతం కలుగడంతో ప్రజల వినతిమేరకు కమిషనర్ మురళీకృష్ణ స్పందించి శనివారం యంత్రాలతో డ్రెయిన్లను శుభ్రం చేయించారు.

వేతన సవరణపై చర్యలు తీసుకోవాలని వినతి



భీమవరంలో కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మతో మాట్లాడుతున్న కార్మిక సంఘం నాయకులు

భీమవరం: గత పన్నెండేళ్లుగా నిలిచిపోయిన వేతన సవరణ విషయంపై చర్యలు తీసుకోవాలని బీఎంఎస్, బీహెచ్ఈఎల్ కార్మిక సంఘం ప్రతినిధులు కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మను కోరారు. శనివారం మంత్రి క్యాంపు కార్యాలయంలో సంఘ నాయకులు రామస్వామి, హరీష్‌వర్మ మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకులు బీఎంఎస్, బీహెచ్ఈఎల్ కంపెనీలకు ముడిసరుకు అందుబాటులో ఉంచడానికి ప్లాంట్స్‌ను ఎన్ఎండీసీ లేదా సెయిల్‌లో కలిపే విషయం, ఈఎంఐ లోన్స్ వడ్డీలను ఏడాది పాటు మారటోరియం విధించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై శ్రీనివాసవర్మ స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

మూగజీవాలపై జాలి, దయ చూపాలి



నవాబుపాలెం ఎంపీయూపీ స్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం



దువ్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మూగజీవాల పట్ల ప్రజలు జాలి, దయ చూపాలని నందమూరు పశువైద్యాధికారి వి.సునీల్‌కుమార్ అన్నారు. జంతు హక్కు అవగాహన వారోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని నవాబుపాలెం ఎంపీయూపీ స్కూల్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సునీల్ కుమార్ మాట్లాడుతూ పెంపుడు జంతువులపై దయతో మెలగాలన్నారు. వ్యాధి సోకినప్పుడు చికిత్స అందించడం, ఒత్తిడికి లోను కాకుండా చేయాలన్నారు. నవాబుపాలెం, కృష్ణాయపాలెం పశుసంవర్ధక శాఖ సహాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, పి.సువర్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

పశు సంరక్షణ చట్టాలపై అవగాహన అవసరం

తణుకు టౌన్: పశువులను హింసించడం దారుణమని, వాటిపట్ల జాలి, దయతో వ్యవహరించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ కరణం శంకర్ భావన్నారాయణ తెలిపారు. శనివారం తణుకు రూరల్ మండలం దువ్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జంతు హక్కుల పరిరక్షణ, సంక్షేమంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈకార్యక్రమంలో విద్యార్థులకు జంతు హక్కుల పరిరక్షణ చట్టం 1960 గురించి వివరించారు. పశువుల పెంపకం దారులు కూడా పశువులను విచ్చల విడిగా రోడ్లపై వదిలివేయకూడదన్నారు. ప్రమాదంలో గాయపడిన, జబ్బుపడిన పశువులకు వైద్యం అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం పీ జయరాజు, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఎం అనుపమ

పాలకొల్లు అర్బన్: సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ ఎం.అనుపమ కోరారు. పాలకొల్లు మండల పరిషత్ కార్యాలయంలోని జీఎంసీ బాలయోగి సమావేశ మందిరంలో శనివారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో అనుపమ మాట్లాడారు. ఇంజినీరింగ్ అధికారులు ప్రతి రోజూ మంచినీటి పరీక్షలు నిర్వహించి క్లోరినేషన్ శాతం నమోదు చేయాలని కోరారు. అలాగే ప్రతి 15 రోజులకోసారి ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రపరచాలని, అలాగే తదుపరి శుభ్రపరిచే తేదీలను నమోదు చేయాలని సూచించారు. మంచినీటి పైపులైన్‌ల మరమ్మతులు, సంపులు, ఫిల్టర్‌బెడ్‌ల మరమ్మతులు చేయాలన్నారు. అలాగే వర్షాకాలంలో ఆయా గ్రామాల్లో మురుగునీటి గుంటలు లేకుండా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు మాట్లాడుతూ కలుషితమైన నీటి ద్వారా వచ్చే వ్యాధులు పైనా, అలాగే దోమల ద్వారా వచ్చే వ్యాధులపైనా అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఆశ, ఏఎన్ఎంలు ప్రజలకు వ్యాధుల పట్ల అవగాహన, జాగ్రత్తలు వివరించాలని కోరారు.

ఎస్సీ శ్మశాన వాటిక ఆక్రమణపై నిరసన



వెంపలో ఎస్సీ శ్మశాన వాటిక వద్ద నిరసన తెలుపుతున్న దళితులు

భీమవరం అర్బన్: వెంపలో ఎస్సీ శ్మశానవాటికను ఆక్రమించుకున్న వారిపై తగు చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ మాజీ జిల్లా సహాయ కార్యదర్శి ఇంజేటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. భీమవరం మండలంలోని వెంప గ్రామంలో శనివారం ఎస్సీ శ్మశానవాటిక వద్ద దళితులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇంజేటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎస్సీ శ్మశానవాటిక ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకుని, దళితులను అవమానించిన వారిపై చర్యలు చేపట్టాలన్నారు. శ్మశానవాటికను ఆక్రమించుకుని గ్రామానికి చెందిన రైతు తన చేపల చెరువు వరకు రోడ్డు వేసుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకున్న దళితులపై దౌర్జన్యానికి దిగుతున్నారన్నారు. అంతేకాకుండా అధికారులు కూడా భూస్వామికి కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. శ్మశానవాటికను అధికారులు సర్వే చేసి కంచె వేయకుండా తాత్సారం చేస్తున్నారన్నారు. ఎస్సీ శ్మశాన వాటిక ఆక్రమణను తొలగించకపోతే ప్రజా సంఘాలతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బండి రాజు, ఇంజేటి త్రిమూర్తులు, పట్టెం చిరంజీవి, గోగులమండ సునీల్, కడిమి ఏసురత్నం, బల్లా రంగయ్య, పాలపర్తి దానియేలు, దొండపాటి బాల, ఇంజేటి పండు, పోలుకొండ శాంతకుమారి, బొబ్బనపల్లి సువార్త, చిలకపాటి ఆనంద్, ఇంజేటి మరియమ్మ, చిలకపాటి ఆదాము, మందా చిట్టిబాబు, నేతల దేవదానం తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత ప్రమాణాలతో బోధించాలి

ఆకివీడు: విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో విద్యాబోధన అందజేయాలని జెడ్పీటీసీ సభ్యులు వేగేశ్న వెంకట్రాజు (యండగండి శ్రీను) అన్నారు. మండలంలోని చినకాపవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థి కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చినకాపవరం జెడ్పీ ఉన్నత పాఠశాలకు గతంలో మంచి పేరు ఉందన్నారు. విద్యార్థులు మండల స్థాయిలో ప్రథమ స్థానం నిలిచిన సంఘటనలు ఉన్నాయన్నారు. క్రీడల్లో కూడా ముందజలో ఉన్నారని చెప్పారు. అదేరీతిలో విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నాతిరెడ్డి ఆదిలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు అల్లాడి బాలాజీ, మద్రివాడ వెంకట్రావు, శ్రీనివాసరావు, చెన్నంశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసీ విద్యార్థులకు ర్యాంకులు

తాడేపల్లిగూడెం: స్థానిక ఆదికవి నన్నయ్య క్యాంపస్‌లో ఫార్మసీ ఫైనలియర్ విద్యార్థులు ఏపీపీజీఈసెట్‌లో 14 ర్యాంకులు సాధించారు. ఒక విద్యార్థి నైఫర్‌లో విజయం పొందారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ టి.అశోక్ తదితరులు అభినందించారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు



పెదతాడేపల్లి గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని పెదతాడేపల్లి, నందమూరు గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. పెద తాడేపల్లి సర్పంచ్ పోతుల అన్నవరం ఆధ్వర్యంలో గ్రామంలోని చెత్తా చెదారాలను తొలగించారు. ఆయన వెంట ఎంపీడీవో ఎస్.సుబ్రహ్మణ్య శర్మ, ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్, సచివాలయ సెక్రటరీలు జక్కిలంక దివ్య, ఆకుల లక్ష్మీమణికంఠేశ్వరి, సిబ్బంది ఉన్నారు.

వేగంగా ఉపాధి పనులు

మొగల్తూరు: మొగల్తూరు పంచాయతీలోని నక్కావారిపాలెం, ఇంజేటివారిపాలెం, పాలకమ్మచెరువు తదితర ప్రాంతాలతో పాటు మండలంలోని కేపీ పాలెం నార్త్, సౌత పేరుపాలెం నార్త్, సౌత్ గ్రామాల్లో పంటబోదె పనులు చురుగ్గా జరుగుతున్నాయి. శనివారం కేపీ పాలెం సౌత్‌లో చేపట్టిన పనులను జేఈ ఆనంద్, టీఏ వెంకటేశ్వరరావు పరిశీలించి తవ్వకం పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కూలీలకు సూచించారు.